# విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు

- సరస్వతి హైస్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్

**శెనార్తి మీడియా,రామడుగు :**



విద్యార్థులకు ఉపాధ్యాయులే తొలి మార్గదర్శకులని సరస్వతి హైస్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. రామడుగు మండలం వెలిచాల సరస్వతి హైస్కూల్ లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చి, గురువు జాతి గౌరవాన్ని లోకానికి చాటి చెప్పిన మేధావి రాధాకృష్ణన్ అని అన్నారు. రాధాకృష్ణన్ జయంతిని ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవంగా గుర్తించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులు తమ గురువులను శాలువా, మెమొంటోతో సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం, టీచర్స్ పాల్గొన్నారు.



### పల్లి బీ లో వినాయకున్ని దర్శించుకున్న

# ఎమ్మెల్యే బోథ్ అనిల్ జాదవ్

**శెనార్తి మీడియా, తలమడుగు :**

మండలంలోని పల్లి(బీ) గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకున్ని శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. శబరిమాత ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకునికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా శబరిమాత ఆలయంలో పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఇటీవల భారీ వర్షాలతో దేవాపూర్ గ్రామం వద్ద తెగిపోయిన కల్వర్టును అధికారులతో మాట్లాడి దగ్గరుండి మరమ్మతు పనులు చేయించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేష్, నాయకులు కేదారేశ్వర్ రెడ్డి, మొట్టె కిరణ్, అభిరామ్ రెడ్డి, రవికాంత్ యాదవ్, కట్కం శ్రీనివాస్, అబ్దుల్లా, సుదర్శన్ రెడ్డి, గజానంద్, ప్రకాష్ రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లోనే వయోవృద్ధుల కేసులు

- కలెక్టర్ కుమార్ దీపక్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

వయోవృద్ధుల సంరక్షణ, సంక్షేమానికి సంబంధించిన కేసులు ఇకపై ఆన్‌లైన్ ద్వారానే దాఖలు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజెన్స్ మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ యాక్ట్–2007, రాష్ట్ర నియమావళి–2011 ప్రకారం టీ.ఎస్.సి.ఎం.ఎం.ఎస్. పోర్టల్ లేదా మీసేవ కేంద్రాల ద్వారా మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన చెప్పారు. ఆఫ్‌లైన్ దరఖాస్తుల స్వీకరణను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసిందని, ఈ నేపథ్యంలో పోర్టల్ వినియోగంపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. సీనియర్ సిటిజెన్లు తమ హక్కుల పరిరక్షణకు ఈ వేదికను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.




# విజన్ హైస్కూల్ లో టీచర్స్ డే వేడుకలు

**కరీంనగర్, శెనార్తి మీడియా :**

కొత్తపల్లి మండలం రేకుర్తి విజన్ హైస్కూల్ లో టీచర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్లను స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ ఘనంగా సత్కరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏటా టీచర్స్ డే వేడుకలను జరుపుకుంటామన్నారు. విద్యార్థులు రాధాకృష్ణన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సందవేణి వెంకట్, టీచర్స్ పాల్గొన్నారు.

# ఈరగొల్ల శివ్వన్నను సన్మానించిన ఎమ్మెల్యే



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్ :**

బోరజ్ మండలం ఆకుర్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఈరగొల్ల శివ్వన్న కు ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కాగా అయనను జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ శాలువాతో సత్కరించి, స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు. ఆకుర్ల ప్రాథమిక పాఠశాలలో గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు సత్కరించి అభినందనలు తెలిపారు. యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కిష్టన్న, దయా కర్, రామకృష్ణ, శంకర్, తమ్మల గంగన్న, ఆకుర్ల గ్రామస్తులు రాజు, వైద్య సాయి, మన్సుర్, దివాకర్, లక్ష్మన్ డాలే, మారుతీ మహేందర్, ఆదర్శ్, సంతోష్, అభయ్ తదితరులు పాల్గొన్నారు..



# ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

పరిషత్ ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శించారు. ఇటీవల గ్రామ పంచాయతీ వారీగా తుది ఫొటో ఓటర్ల జాబితా ప్రదర్శన పూర్తయింది. తాజాగా పరిషత్ ఓటర్ల జాబితా షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఎన్నికల సంఘం ప్రకారం ఈ నెల 6 నుంచి 8 వరకు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. 8న జిల్లా, మండల స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు జరగనున్నాయి. 9న అభ్యంతరాల పరిష్కారం చేసి, 10న అన్ని పోలింగ్ కేంద్రాల్లో తుది ఫొటో ఓటరు జాబితా ప్రదర్శించనున్నారు. జెడ్పీ కార్యాలయంలో సీఈవో గణపతి ఆధ్వర్యంలో ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు ఖరారు చేస్తూ ఇప్పటికే అధికారికంగా ప్రకటించినట్లు తెలిపారు. జిల్లాలో 16 జెడ్పీటీసీ స్థానాలు, 129 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, మొత్తం 713 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్లు 3,76,676 మంది ఉండగా, వీరిలో మహిళలు 1,91,015 మంది, పురుషులు 1,85,646 మంది, ఇతరులు 15 మంది ఉన్నారు.

# ఘనంగా సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వర కళ్యాణం

**శెనార్తి మీడియా, చేగుంట:** చేగుంట మండల కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వర్తక వాణిజ్య సంఘం, గుడి కమిటీ ఆధ్వర్యంలో వాసుదేవ శర్మ బృందం చే సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వర కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు.కార్యక్రమానికి హాజరైన తహసిల్దార్ శ్రీకాంత్ ప్రత్యేక పూజలు నిర్వహించగా, కమిటీ సభ్యులు ఆయనకు శాలువాతో సన్మానం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఈ వేడుకలో ఆర్ఐలు జై భారత్ రెడ్డి, సంతోష్, సర్వేయర్ రవీందర్ రెడ్డి, వైశ్య సంఘం అధ్యక్షుడు తుడుపునూరి నాగరాజు, ప్రధాన కార్యదర్శి అయిత రఘురాములు, మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, సంఘ సేవకులు అయిత పరంజ్యోతి, కమిటీ సభ్యులు హన్మయ్య, నాగరాజు, రాజేశ్వర్, బాలేశం, రాఘవ, శ్రీనివాస్, వెంకటేశం, రాములు, శంకర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులను సన్మానించిన యూత్ సభ్యులు



**శెనార్తి మీడియా, తలమడుగు :**

ప్రతి ఒక్క విద్యార్థి మీ ఎదుగుదలకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువద్దని బ్లూ భీమ్ యూత్ అధ్యక్షులు జి.ప్రేమేందర్ అన్నారు. తలమడుగు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం రోజు ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను నిర్వహించగా ఈ కార్యక్రమానికి బ్లూ భీమ్ యూత్ సభ్యులు హాజరైనారు. యూత్ సభ్యులు మరియు జిల్లా మాల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు నేతల గంగన్న లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా కలెక్టర్ డీఈవో చేతుల మీదుగా అవార్డు అందుకున్న రాజేందర్ ను శాలువాతో సత్కరించి అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని ఎంఈఓ వెంకట్ రావు తో పాటు ఉపాధ్యాయులందరినీ శాలువాతో సత్కరించి వారి సేవలను యూత్ సభ్యులు కొనియాడారు. ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులను సైతం శాలువతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నేతుల గంగన్న, బ్లూ భీమ్ యూత్ అధ్యక్షులు ప్రేమేందర్ సభ్యులు అఖిలేష్, ప్రవీణ్, అశోక్, రాజు, వినయ్, ఉపేందర్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ హామీలు నిలబెట్టాలి

- వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలి
- మందకృష్ణ మాదిగ

**శెనార్తి మీడియా, మంచిర్యాల (జైపూర్):**



ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలో చెన్నూరు నియోజకవర్గ వీహెచ్పీఎస్ చేయూత పెన్షన్ దారుల సన్నాహక సదస్సులో ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన 21 నెలలు గడిచినా వికలాంగులకు రూ.6 వేల పెన్షన్, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు, చేయూత పథకానికి రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలనే హామీ నెరవేరలేదని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్న కేసీఆర్ అసెంబ్లీలో పెన్షన్ అంశంపై ఎప్పుడూ మాట్లాడలేదని పేర్కొన్నారు. పెన్షన్లు పెంచకపోతే ప్రభుత్వంపై తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్ల ముట్టడులు, రాస్తారోకోలు నిర్వహించే దిశగా ఉద్యమం చేస్తామని తెలిపారు.



### గణనాథుడి లడ్డు రూ.1,51,000

**శెనార్తి మీడియా, జుక్కల్:** కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని పెద్ద ఏడిగి గ్రామంలో మున్నూరు కాపు గణేష్ మండలి ఆధ్వర్యంలో లడ్డు వేలంపాట ఘనంగా నిర్వహించారు. శనివారం గణేష్ నిమజ్జనం వేడుకల్లో భాగంగా మండపంలోని గణనాథ విగ్రహం వద్ద ఉన్న లడ్డు వేలం జరిగింది.వేలంపాటలో పోటీతనం చాలా ఎక్కువగా ఉండగా, చివరికి పెద్ద ఏడిగి గ్రామానికి చెందిన సుంకరివార్ అశోక్ రూ.1,51,000కు లడ్డును గెలిచారు. రెండవ (చిన్న) లడ్డును అపాసివార్ గంగారం రూ.40,000కు దక్కించుకున్నారు అని మున్నూరు కాపు గణేష్ మండలి నిర్వాహకులు తెలిపారు.

# సీఐ వైఖరిపై మున్నూరు కాపు సంఘం నిరసన

**శెనార్తి మీడియా, మంచిర్యాల (చెన్నూర్):**

రైతుల సమస్యలకు మద్దతు తెలిపిన యువకుడిపై సీఐ చేయి చేసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మున్నూరు కాపు సంఘం యూత్ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. శనివారం చెన్నూర్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 3న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద యూరియా కోసం జరిగిన ధర్నాకు మద్దతు తెలిపిన మాజీ కౌన్సిలర్ దోమకొండ అనిల్‌పై పట్టణ సీఐ దేవేందర్ రావు చేయి చేసుకోవడం హేయమని ఆయన విమర్శించారు. సీఐ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో చెన్నూర్ బంద్ సహా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గతంలో కూడా మున్నూరు కాపు యువకులపై పోలీసులు దాడి చేసిన సంఘటనలు ఉన్నాయని, ఇకపై అలాంటి వాటిని సహించబోమని స్పష్టం చేశారు.

